క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



వెల్దుర్తి లేఅవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, ఈఈ నాగరాజు తదితరులు

వెల్దుర్తి: రూ.కోట్లు వెచ్చించి విద్యుత్, తాగునీరు, రహదారుల సౌకర్యం కల్పించడంతో అన్ని రకాలుగా అనువుగా ఉన్న వెల్దుర్తి జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ సిద్ధలింగమూర్తి అన్నారు. ఆయన బుధవారం హౌసింగ్ ఈఈ నాగరాజుతో కలిసి బ్రహ్మగుండం సమీపంలోని లేఅవుట్‌ను పరిశీలించారు. ప్రధాన రహదారికి అతి సమీపంలో ఉన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రాకపోవడం, అధికారులు తీసుకుంటున్న చర్యలపై స్థానిక ఎంపీడీఓ శ్రీనివాసరావ్, హౌసింగ్ ఏఈ అరవింద్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ సిబ్బంది ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆలూరు: వీధులలో చెత్త, చెదారం ఎక్కడపడితే అక్కడ విసిరేయవద్దని, తడి పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని సర్పంచ్ మోహన్‌రాజ్ కోరారు. బుధవారం గ్రామంలో గ్రామ వార్డులు సభ్యులు, గ్రామస్తులు, పెద్దలు, పంచాయతీ కార్యదర్శి వెంకట నాయుడు సమక్షంలో వివిధ కాలనీలలో స్వచ్ఛతే సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఆరవ రోజుకు చేరిన సప్తభజనలు



పూజలందుకున్న ఉచ్చీరప్ప తాత

ఆలూరు: మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో కొలువుదీరిన ఉచ్చీరప్పతాత దేవాలయంలో గ్రామ శాంతి కోసం చేపట్టిన సప్త భజనలు బుధవారం నాటికి ఆరవ రోజుకు చేరాయి. ఉదయం స్వామి వారికి వేద మంత్రోచ్చరణ మధ్య గంగ, ఫల, పుష్ప, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి తదితర ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు చంద్రమౌళీశ్వర స్వామి సమక్షంలో నిర్వహించారు. రేయింబవళ్లు సప్తభజనలు చేస్తున్న భక్తులకు గ్రామస్తులు, భక్తులు కులమతాలకు అతీతంగా భోజన సదుపాయం కల్పించారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి

చిప్పగిరి: తల్లిదండ్రులు మరణించడంతో అనాథలుగా మారిన చిన్నారులు గణేష్ (13), పూజిత (10)లకు పంచాయతీరాజ్ అండ్ జోనల్ వింగ్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్, చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. హాలహర్వి మండలంలోని బాపురం గ్రామానికి చెందిన మంజునాథశర్మ, శారదమ్మ దంపతులు. మంజునాథ శర్మ పదేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించగా తల్లి శారదమ్మ మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృత్యువాత పడింది. దీంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి బుధవారం వారికి ఆర్థిక సాయం అందించారు. పిల్లలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన చాకలి అశోక్

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామ సమీపంలో బైక్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో బైకిస్టుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గోనెగండ్ల మండలం చిన్నమర్రివీడు గ్రామానికి చెందిన చాకలి అశోక్ సొంత పనుల నిమిత్తం వచ్చి బుధవారం నాగలదిన్నె నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. పెద్దకొత్తిలి గ్రామానికి చెందిన నరసింహులు తన ఆటోతో నందవరం నుంచి నాగలదిన్నెకు బయలుదేరాడు. నాగలదిన్నె సమీపంలోని వాటర్ స్కీమ్ వద్ద చాకలి అశోక్ మద్యం మత్తులో ఫోన్ మాట్లాడుతూ అతివేగంగా వెళ్లి ఎదురుగా వచ్చిన ఆటోను ఢీకొట్టగా ఆటో బోల్తా పడింది. అశోక్‌కు కుడి కాలికి రక్త గాయం, మోకాలి చిప్పపై రక్త గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ నరసింహులు మరోక ఆటోలో అశోక్‌ను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. నరసింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం





బాల్య వివాహాల నిర్మూలనపై సూచనలు చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ రమ, మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాజశేఖర్, పక్కన ఎంపీడీఓ కవిత, సీఐ మురళీమోహన్

మద్దికెర: అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు వయసు వచ్చేంత వరకు వివాహాలు చేయరాదని, అలాగాకుండా బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమని సంబంధిత వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కలెక్టర్ రమ హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో బాల్య వివాహాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ వైద్యాధికారి నగేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, ఏఎస్‌ఐ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరి

విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ రమ హెచ్చరించారు. ఆమె బుధవారం స్థానిక కస్తూర్బా విద్యాలయంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలలో లోటు చేస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాలలో విత్తనాల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, ఏఓ రవి ఉన్నారు.

పత్తికొండటౌన్: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషిచేయాలని మండల ప్రత్యేకాధికారి జి.రాజశేఖర్, ఎంపీడీఓ ఎం.కవిత, సీఐ కె.మురళీమోహన్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో బాల్యవివాహాల చట్టం–2006 గురించి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం వల్ల మానసిక, శారీరక పరిపక్వత లేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. మహిళా పోలీసులు తమ పరిధిలో బాల్య వివాహాల గురించి తహసీల్దార్‌కు, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎంఈఓలు మస్తాన్‌వలి, రమేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

హాలహర్వి: బాల్యవివాహాల నిషేధ చట్టం గురించి ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్పెషల్ ఆఫీసర్ రామాంజనేయులు, ఎంపీడీఓ ఆంతోని అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందికి బాల్యవివాహాల నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆలూరు: బాల్య వివాహాలను అరికట్టేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు కృషి చేయాలని తహసీల్దార్ రామాంజనేయులు సూచించారు. స్థానిక ఐసీడీఎస్, సీడీపీఓ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం సీడీపీఓ లలిత సమక్షంలో బాల్యవివాహాల నివారణ, బాలల చట్టాలు తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ అల్లబకాష్, ఎంఈఓ కోమలాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

ఎమ్మిగనూరురూరల్: ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలకంఠ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఆర్ మురహర రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదిన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి భయం లేదని, మరొకరికి ప్రాణాలు కాపాడిన వారు అవుతారని చెప్పారు. బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ అంకాల రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులు విట్టారమేష్, వెంకటరాముడు, నారాయణ, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో భవిష్యత్తు నాశనం

ఎమ్మిగనూరుటౌన్: కళాశాలల్లో ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, ర్యాగింగ్ చేస్తే శిక్షార్హులవుతారని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి గురుఅరవింద్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యా చట్టాలు, ర్యాగింగ్ నిరోధక చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. విద్యార్థులు స్నేహభావంగా మెలగాలే కాని ర్యాగింగ్ చేయకూడదన్నారు. ఎవరైనా ర్యాగింగ్ చేస్తే బాధిత విద్యార్థులు మండల న్యాయసేవా కమిటీకి సమాచారం ఇవ్వాలని సూచించారు. పలువురు న్యాయవాదులు ర్యాగింగ్ చట్టం, శిక్షలు తదితర అంశాలపై వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు తిమ్మప్ప, కోశాధికారి మురళీకృష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేతో వివాదాల పరిష్కారం



గుడేకల్ సచివాలయంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయులు

ఎమ్మిగనూరురూరల్: భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలోని సచివాలయంలో రీసర్వేపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న భూ హక్కు – భూరక్ష పథకంలో భాగంగా భూములు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. రీసర్వే తరువాత భూమి కొలతల మార్పు, అక్రమంగా ఇతరులకు విక్రయించి రిజిస్ట్రేషన్లు చేయించడం వంటి వాటికి చెక్ పడుతుందన్నారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి గుడేకల్ గ్రామంలో సర్వే జరగుతుందని, రెండు రోజుల ముందుగానే గ్రామ వలంటీర్ల ద్వారా రైతులకు సమాచారం ఇస్తామన్నారు. రీసర్వే జరిగేటప్పుడు రైతులు తప్పకుండా తమ పొలాల్లో ఉండి అధికారులకు సహకరించాలని కోరారు. రీసర్వే డీటీ జోతిర్మయి, వీఆర్వో ఈరన్న, ఇన్‌చార్జ్ మండల సర్వేయర్ అబ్దుల్‌జావీద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైప్‌లైన్ల ఏర్పాటు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో అవసరమైన ప్రాంతాల్లో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆదేశాల మేరకు మంచినీటి పైప్‌లైన్లను ఏర్పాటు చేసి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 18వ వార్డులో రూ.5 లక్షలతో చేపట్టిన మంచినీటి పైప్‌లైన్ పనులను వార్డు ఇన్‌చార్జ్ సోమేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్ తిమ్మరాజును ఆదేశించారు. వాటర్‌వర్క్స్ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆస్పరి: మండలంలోని నగరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈనెల 25వ తేదీన కర్నూలులో జరిగిన అండర్–14–17 హ్యాండ్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో తమ పాఠశాల నుంచి 7వ తరగతి విద్యార్థిని అస్మిత, 10వ తరగతి విద్యార్థిని అనిత ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 29, 30, అక్టోబర్ 1వ తేదీల్లో గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరు కానున్నట్లు చెప్పారు. క్రీడాకారిణులను హెచ్ఎం పుల్లమరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

విత్తనాల కోసం నమోదు చేసుకోండి

ఆస్పరి: సబ్సిడీ శనగ విత్తనాల కోసం రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ నరేంద్రకుమార్ బుధవారం తెలిపారు. మండలానికి 6,300 క్వింటాళ్ల విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. క్వింటం విత్తనాల ధర సబ్సిడీ పోనూ రైతులు రూ.4,800 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎకరానికి 40 కేజీల చొప్పున ఒక రైతుకు గరిష్ఠంగా ఐదెకరాలకు 2 క్వింటాళ్ల విత్తనాలు అందిస్తామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నంబర్‌తో నమోదు చేసుకోవాలని సూచించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆలూరు: వీధులలో చెత్త, చెదారం ఎక్కడపడితే అక్కడ విసిరేయవద్దని, తడి పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని సర్పంచ్ మోహన్‌రాజ్ కోరారు. బుధవారం గ్రామంలో గ్రామ వార్డులు సభ్యులు, గ్రామస్తులు, పెద్దలు, పంచాయతీ కార్యదర్శి వెంకట నాయుడు సమక్షంలో వివిధ కాలనీలలో స్వచ్ఛతే సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

వెల్దుర్తి: పలు గ్రామాలలో దళితులకు శ్మశాన వాటికలు లేక చనిపోయిన వారి పూడ్చివేతకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే దళిత శ్మశాన వాటికలకు స్థలాన్ని కేటాయించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దాదిపోగు నవీన్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సమితి జిల్లా, మండల ప్రతినిధులతో కలిసి బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావ్‌కు వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా గోవర్ధనగిరి, ఇతర గ్రామాలలో సమస్యను పరిష్కరించాలని కోరారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

హాలహర్వి: మండలకేంద్రంలో హాలహర్వి–ఆలూరు ప్రధాన జాతీయ రహదారిపై బుధవారం కారు బైకును ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మండలంలోని అర్దగేరి గ్రామానికి చెందిన భీమలింగప్ప అనే వ్యక్తి బైకుపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

పశు బీమా పాడి రైతులకు వరం

హొళగుంద: వైఎస్సార్ పశు బీమా పథకం వల్ల పాడి రైతులకు మేలు కలుగుతుందని పశు సంవర్ధక శాఖ జేడీ రామచంద్రయ్య అన్నారు. ఆయన బుధవారం హొళగుందలో ఎంపీడీఓ సుభాషిణి, వెటర్నరీ అధికారి సోమశేఖర్‌గౌడ్‌తో కలిసి పాడి సంరక్షణ విధానాలపై సూచనలు చేశారు. పశు బీమాపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలో ముద్ద చర్మపు వ్యాధికి సంబంధించి 5,725 పశువులకు టీకాలు వేసినట్లు ఆయన వెల్లడించారు. రైతులు పాడి పశువుల సంరక్షణపై జాగ్రత్తలు పాటించాలని, ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించి సలహాలు, సూచనలు పొందాలన్నారు.

విజేత కర్నూలు జిల్లా వృషభాలు



రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు

కృష్ణగిరి: మండల పరిధిలోని పుట్లూరు గ్రామంలో శ్రీ మాతామారెమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అంతర్ రాష్ట్రస్థాయి పాల పళ్ల ఎద్దుల బండలాగుడు పోటీల్లో కర్నూలు జిల్లా, పి.రుద్రవరం గ్రామ ఎల్లాగౌడ్ వృషభాలు నిర్ణీత సమయంలో రాతిదూలాన్ని 5222.5 అడుగుల దూరం లాగి విజేతగా నిలిచినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రెండవ స్థానంలో అనంతపురం జిల్లా, పెద్దవడుగూరు మండలం, ఈరన్నపల్లెకు చెందిన వృషభాలు, నంద్యాల జిల్లా, సంజామల మండలం, ముక్కమల్ల గ్రామ ముసాని చంద్రశేఖర్‌రెడ్డి వృషభాలు 5,217.2 అడుగులు లాగి ఉమ్మడిగా నిలిచాయి. మూడవ స్థానంలో గుంటూరు జిల్లా, తాడెపల్లి మండలం, కుంచనపల్లెకు చెందిన పీఆర్ మెమోరియల్ పులగం తిష్ణారెడ్డి వృషభాలు 5,163.9 అడుగులు, నాల్గవ స్థానంలో తెలంగాణ రాష్ట్రం, నాగర్ కర్నూలుకు చెందిన శివ వృషభాలు 4,831.10 అడుగులు, కర్నూలు జిల్లా, కోడుమూరు మండలం, వెంకటగిరికి చెందిన బీ. శషాంక్ సాయిరాఘవ్ వృషభాలు 4,807.8 అడుగుల దూరం లాగి ఐదవ స్థానంలో నిలిచినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీల్లో 24 జతల వృషభాలు పాల్గొనట్లు వారు తెలిపారు. గెలుపొందిన వృషభాల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలను అందజేశారు.

గోనెగండ్లలో 5 నుంచి బండలాగుడు పోటీలు

గోనెగండ్ల: మండల కేంద్రంలో వెలసిన చింతలాముని, నల్లారెడ్డి స్వాముల వారి దశమి సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ఆశీస్సులతో గోనెగండ్ల ట్రాక్టర్స్ యూనియన్ సహకారంతో స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో రాష్ట్రస్థాయి వృషభాల బల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నాయకులు నాగప్ప, ఉసేన్ తెలిపారు. బుధవారం స్థానిక సహకార సంఘం ఆవరణంలో ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దొరబాబుతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. అక్టోబర్ 5వ తేదీ ఆరుపళ్ల సైజు ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5వేలు. అలాగే 6వ తేదీన న్యూ క్యాటగిరీ ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహించి విజేతలకు రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆరుపళ్ల సైజు విభాగంలో రూ.600, న్యూ క్యాటగిరీ విభాగంలో రూ.700 ఎంట్రీ ఫీజు ఉంటుందని వివరాలకు 82474 89945, 99896 42398 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి

ఎమ్మిగనూరురూరల్: ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య సంరక్షణను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మైత్రేయి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య సంరక్షణ ద్వారా ఉచితంగా హెల్త్ చెకప్, మందులు పంపిణీ చేయడంతో పాటు ఫోన్‌లో ఆరోగ్య చికిత్స, సమస్యలపై సలహాలు ఇస్తారని తెలిపారు. బీపీ, షుగర్ తదితర వ్యాధుల పరీక్షలు యోగా/ఆరోగ్య సంరక్షణ తరగతులు నిర్వహిస్తారని చెప్పారు. వైద్య పరీక్షలు చేసి కార్డులను అందచేస్తారని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రవీంద్రదీపక్, డాక్టర్ శ్రీచరణ్, ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కీంల పేరుతో చంద్రబాబు స్కాంలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి

మద్దికెర: టీడీపీ అధికారంలో ఉన్నపుడు చంద్రబాబు స్కీంల పేరుతో స్కాంలు చేసి అడ్డంగా దోచుకున్నారని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..ప్రజల సొమ్ము దోచుకున్న వారిని జైల్లో కాక ఇంట్లో పెడతారా అని విమర్శించారు. ప్రజలకు అన్యాయం చేసిన వారి కోసం దీక్షలు చేయడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మండలంలో రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గతంలో కేఈ డిప్యూటీ సీఎంగా ఉండి కూడా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. మండలంలో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్‌సెంటర్లు, బీఎన్ పేటకు రోడ్డు వేసింది కనిపించలేదా అని ప్రశ్నించారు. చెరువులకు నీరిస్తామని చెప్పి మాజీ సీఎం చంద్రబాబు చేతులెత్తేశారని, ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రూ.241 కోట్లతో 77 చెరువులకు నీరిచ్చారని వివరించారు. పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, సర్పంచ్ విజయుడు, సచివాలయ కన్వీనర్ తాలూరి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ఆర్థిక సాయం



రూ.30 వేల విరాళం అందిస్తున్న జెడ్పీటీసీ, పాఠశాల యాజమాన్యం

వెల్దుర్తి: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి స్థానిక సత్యసాయి హైస్కూల్ యాజమాన్యం తమ వంతు ఆర్థిక సహకారం అందించింది. బుధవారం పాఠశాలలో కరెస్పాండెంట్ రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న మాదిగ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బొమ్మన సుబ్బారెడ్డి అతిథులుగా హాజరై మాట్లాడారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి అంధ కళాకారులు, జ్ఞాననేత్ర అంధుల స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సందా శ్రీనివాస్ తదితరులు గాన కచేరీలతో అలరిస్తూనే విరాళాలు సేకరించడం అభినందనీయమన్నారు. ఇదే కోవలో ఈనెల 15న తమ పాఠశాలలో గాన కచేరి జరిపి సేకరించిన రూ.30 వేల విరాళాన్ని అతిథుల చేతులమీదుగా సందా శ్రీనివాస్‌కు అందించారు. హెచ్ఎం గఫూర్, ఏఓ ప్రసాద్, డైరెక్టర్ తిప్పారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లారీ ట్యాంకర్‌లో డీజిల్ చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఓం శాంతి సర్కిల్ సమీపంలోని జీఎం పెట్రోల్ బంక్‌లో బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో బియ్యం లోడ్‌తో ఆగిఉన్న లారీ ట్యాంకర్ నుంచి 341 లీటర్ల డీజిల్ చోరీకి గురైంది. మంగళవారం రాత్రి ఏపీ 39 డబ్ల్యూ 7139 లారీలో పేద ప్రజలకు పంపిణీ చేసే బియ్యంను ఆదోని గోడౌన్ నుంచి తీసుకొని ఎమ్మిగనూరు స్టాక్ పాయింట్‌కు తరలిస్తున్నారు. అర్ధరాత్రి కావడంతో డ్రైవర్ ఈరన్న జీఎం పెట్రోల్ బంక్ వద్ద లారీని నిలిపి తన భార్య ఊరైన ఎర్రకోటకు వెళ్లాడు. బుధవారం ఉదయం వచ్చి చూడగా లారీ డీజిల్ ట్యాంక్ ఓపెన్ చేసి ఖాళీగా కనిపించడంతో పెట్రోల్ బంక్ సిబ్బందిని వాకబు చేశారు. పెట్రోల్ బంక్‌లోని సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించగా వేకువజామున 2.58 గంటలకు ఈచర్ లారీ వేగంగా వచ్చి నిల్చున్న లారీ ట్యాంక్‌కు అడ్డుగా పెట్టి 10 నిమిషాల్లో డీజిల్ మొత్తం తీసుకొని మార్కెట్ యార్డ్ వైపు వెళ్లి పోయినట్లు గుర్తించారు. చోరీకి గురైన డీజిల్ విలువ రూ.33,874 ఉంటుందని ఆదోనిలో ఫుల్ ట్యాంక్ చేయించుకొని వచ్చిన బిల్లును డ్రైవర్ చూయించాడు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు లారీ డ్రైవర్ ఈరన్న తెలిపారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

పత్తికొండటౌన్: క్రీడలకు ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం ఇస్తోందని పత్తికొండ ఏంఈఓ–2 గాజుల రమేశ్ అన్నారు. రెండురోజులుగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్ బుధవారం సాయంత్రం ముగిశాయి. బాలికల క్రీడల పోటీలను ఎంఈఓ గాజుల రమేశ్, హాస్టల్ వార్డెన్లు దూదేకొండ రమేశ్, నాగరాజు ప్రారంభించారు. స్కూల్‌గేమ్స్ ఇన్‌చార్జులు చందూనాయక్, రంగస్వామి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి రెండురోజుల టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌కు 1200మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారన్నారు. అండర్–14, అండర్–17 బాలికలు, బాలుర విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, బాల్‌బ్యాడ్మింటన్, యోగ, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అందరి సహకారంతో స్కూల్ గేమ్స్ విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన వారు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

కులగణనతో అణగారిన వర్గాలకు మేలు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం బీసీ కుల గణనకు శ్రీకారం చుట్టడంతో రాష్ట్రంలో అణగారిన వర్గాలకు మేలు చేకూరనుందని రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వందేళ్ల తర్వాత కులగణనకు సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. దీనిపై అసెంబ్లీలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ కమిటీ నివేదికను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. కులగణనతో రాష్ట్రంలో అణగారిన వర్గాల వారికి సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అన్ని విధాలుగా మేలు చేకూరనుందన్నారు. 1951 నుంచి ఇప్పటి వరకు కులగణన ప్రస్తావనే లేదని, ఏ ప్రభుత్వం కులగణనపై దృష్టి సారించలేదన్నారు. ప్రజలకు మేలు చేసేలా సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ప్రజలకు ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి



విద్యార్థులు ప్రదర్శించిన నమూనా ప్రాజెక్టులు

గోనెగండ్ల: విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించేందుకు సైన్స్ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడతాయని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అజయ్‌కుమార్, ఎలక్ట్రానిక్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ సుభాష్ చంద్రనాయుడు, ఎంఈఓ రామాంజినేయులు అన్నారు. బుధవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ టింకర్ ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల సైన్స్ నమూనా ప్రాజెక్టులను ప్రదర్శించారు. వాటిని అధికారులు పరిశీలించి ఆయా ప్రాజెక్టుల ఉపయోగాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సబ్‌ప్లాన్ నిధులు ఎస్సీ, ఎస్టీలకే ఖర్చుచేయాలి

దేవనకొండ: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఆ వర్గాలకే వినియోగించాలని సెర్ప్ రాష్ట్ర ఉన్నతాధికారి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన దేవనకొండలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై సంబంధిత అధికారులతో చర్చించి, విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. సబ్‌ప్లాన్ నిధులను ఎస్సీ, ఎస్టీ మహిళల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చెల్లించిన రికవరీ సక్రమంగా సభ్యులకు జమ చేయాలన్నారు. తప్పుగా సరిచేయరాదన్నారు. ఎవరైనా తప్పుగా చేస్తే చర్యలు తప్పవన్నారు. తప్పుగా చేసిన మొత్తం రూ.1,65,535 దుర్వినియోగమయ్యిందని, దీనిపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. పది రోజుల లోపు రికవరీ చేసి మెంబర్ ఖాతాకు జమ చేయాలని కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు. లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డీయూసీ వై.కాశీశ్వరుడు, దయాసాగర్, ఏపీఎం రమేష్, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో 58 టీఎంసీలకు తగ్గిన నీటి నిల్వ

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయంలో బుధవారం నీటి నిల్వ 58 టీఎంసీలకు తగ్గింది. నెల రోజుల క్రితం 79 టీఎంసీల నీరు ఉండేది. జలాశయం ఎగువ భాగంలో వర్షాలు తగ్గడం, ఎండల కారణంగా నీటి చేరిక తగ్గిపోయింది. కాలువలకు నీటిని వదులుతుండడంతో జలాశయంలో మూడు రోజులకు 2 టీఎంసీల చొప్పున నీరు ఖాళీ అవుతోంది. డ్యాంలో బుధవారం ఇన్‌ఫ్లో 409 క్యూసెక్కులు మాత్రమే ఉండగా అవుట్‌ఫ్లో 7,030 క్యూసెక్కులుంది. ఎల్లెల్సీ కాలువ ఆంధ్రలో ప్రారంభమయ్యే 250 కి.మీ వద్ద 350 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవహిస్తున్నాయి. డ్యాంలో నీటి నిల్వను బట్టి ఈ ఏడాది రబీ సాగు ప్రశ్నార్థకంగా మారింది.

న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలి

పత్తికొండటౌన్: పార్లమెంటులో బిల్లు ఆమోదించి దేశవ్యాప్తంగా న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలుచేయాలని బార్‌అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణయ్య, రంగస్వామి, న్యాయవాదులు డిమాండ్ చేశారు.

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్రసమితి పిలుపు మేరకు బుధవారం పత్తికొండలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదురుగా న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ 35 ఏళ్ల వయస్సు పైబడి ఎన్‌రోల్ చేసుకున్న న్యాయవాదులకు వెల్ఫేర్ ఫండ్‌లో అవకాశం కల్పించాలన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.